


# కెరటం న్యూస్

( సామాన్యుడి ఆయుధం )




Published from.. Hyderabad, Khammam, Warangal, Nalgonda

సంపుటి : 04 సంచిక :171 | మంగళవారం 24 జూన్ 2025 | ఎడిటర్ : వనం నాగయ్య | పేజీలు : 4 ఫోన్ : 9441877695

## ఆగిపోయే శ్వాసకు రక్తదానంతో ఊపిరి పోద్దాం

● అంకుర హాస్పిటల్స్ సీఈఓ డా. ఉన్నం కృష్ణ ప్రసాద్, అంకుర హాస్పిటల్స్ మెడికల్ డైరెక్టర్ డా. సిహెచ్ రాకేష్

● హైదరాబాద్ ఆయు ఫౌండేషన్, ఖమ్మం విజయ శ్రీ బ్లడ్ బ్యాంక్ సౌజన్యంతో ఖమ్మం అంకుర హాస్పిటల్స్ లో రక్తదాన శిబిరం గ్రాండ్ సక్సెస్..



**ఖమ్మం బ్యూరో,23 జూన్ (కెరటం న్యూస్):** రక్తదానం చేసి ఆగిపోయే శ్వాసకు ఊపిరి పోద్దామని ప్రాణాన్ని నిలబెట్టే రక్త దానం కన్నా గొప్పది మరొకటి లేదని అంకుర హాస్పిటల్ సీఈవో డా. కృష్ణ ప్రసాద్ ఉన్నం అంకుర హాస్పిటల్స్ ఖమ్మం డైరెక్టర్ డాక్టర్ సిహెచ్ రాకేష్ అన్నారు. సోమవారం ఖమ్మం లోని అంకుర హాస్పిటల్స్ లో హైదరాబాదులోని ఆయు ఫౌండేషన్ మరియు ఖమ్మంలోని విజయ శ్రీ బ్లడ్ బ్యాంకు సౌజన్యంతో ఖమ్మంలో అంకుర హాస్పిటల్స్ లో మెగా రక్తదాన వైద్య శిబిరం నిర్వహించారు.

ఆయు ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంకుర హాస్పిటల్స్ లో జరిగిన ఈ కార్యక్రమానికి యువత భారీ సంఖ్యలో స్పందించి తమ సేవాభావాన్ని చాటుకుని రక్తదానం చేశారు. అంకుర హాస్పిటల్ సీఈవో కృష్ణ ప్రసాద్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ సిహెచ్ రాకేష్ మాట్లాడుతూ...

## డీటీ రాజేష్ ఖన్నాకు అండగా నిలిచిన ఉద్యోగుల జేఏసీ

● ఆస్పత్రికి వెళ్లి పరామర్శించిన జేఏసీ ఛైర్మన్ లచ్చిరెడ్డి

● బిల్లులను మాఫీ చేయించి డిశ్చార్జికి ఏర్పాటు చేసిన నేతలు



**హైదరాబాద్ బ్యూరో,23 జూన్ (కెరటం న్యూస్):** అనారోగ్యంతో ఆస్పత్రి పాలై బిల్లులు చెల్లించలేక తీవ్రమైన ఇబ్బందుల్లో ఉన్న డిప్యూటీ తహశీల్దార్ రాజేష్ ఖన్నాకు తెలంగాణ ఉద్యోగుల జేఏసీ ఛైర్మన్, డిప్యూటీ కలెక్టర్ల సంఘం అధ్యక్షులు వి.లచ్చిరెడ్డి అండగా నిలిచారు. వి.లచ్చిరెడ్డి, తెలంగాణ తహశీల్దార్స్ అసోసియేషన్(టీజీటీఏ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్ పాకతో కలిసి సోమవారం ఆస్పత్రికి వెళ్లి రాజేష్ ఖన్నాను పరామర్శించారు. అప్పటికప్పుడే ఆస్పత్రి బిల్లు సమస్యను కూడా పరిష్కరించి రాజేష్ ఖన్నా డిశ్చార్జికి ఏర్పాట్లు చేశారు.

వరంగల్ జిల్లా, నల్లబెల్లి డిప్యూటీ తహశీల్దార్ రాజేష్ఖన్నా తీవ్రమైన అనారోగ్యానికి గురయి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేరారు. 25 రోజులకు రూ.20 లక్షలకు పైగా ఆస్పత్రిలో బిల్లు అయింది. అప్పటికే రూ.13 లక్షల వరకు కుటుంబ సభ్యులు వివిధ రూపాలలో డబ్బులు తెచ్చి బిల్లులను చెల్లించారు.

## కాళేశ్వరం ప్రాజెక్టు ముమ్మాటికి అవినీతి ప్రాజెక్టే: ఎమ్మెల్యే రాజాసింగ్



## పంచాయతీ ఎన్నికలకు నెల రోజుల టైం ఇవ్వండి

### : హైకోర్టులో ప్రభుత్వం

**న్యూస్ డెస్క్, 23 జూన్ (కెరటం న్యూస్):** ఎన్ని రోజుల్లో గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తారో చెప్పాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని తెలంగాణ హైకోర్టు ప్రశ్నించింది. గత ఫిబ్రవరిలోనే ఎన్నికలు నిర్వహిస్తామన్న ప్రభుత్వం ఎందుకు ఎన్నికలు నిర్వహించలేదన్న నిలదీసింది. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై నల్గొండ జిల్లా మాజీ సర్పంచ్ లతో పాటు దాఖలైన మొత్తం ఆరు పిటిషన్లపై ఇవాళ తెలంగాణ హైకోర్టులో విచారణ జరిగింది. 2024 ఫిబ్రవరి 1వ తేదీతో తెలంగాణలో సర్పంచ్ ల పదవీ కాలం ముగిసిపోగా ఎంపీటీసీ సభ్యుల పదవీ కాలం 2024 జులై 5తో పూర్తయింది. నిబంధనల ప్రకారం ఆరు నెలలలోపు ఎన్నికలు నిర్వహించాల్సి ఉండగా ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం జాప్యం చేస్తున్నదని తెలంగాణ హైకోర్టులో గతంలో పిటిషన్లు దాఖలు కాగా వీటిపై ఇదివరకు సైతం వాదనలు జరిగాయి.



● ఎన్నికలు జరపకపోవడంపై హైకోర్టు ప్రశ్నలు – సమయమివ్వాలంటూ ప్రభుత్వం విజ్ఞప్తి ● ఎన్నికల నిర్వహణకు రెండు నెలల సమయం కావాలని రాష్ట్ర ఎన్నికల సంఘం వినతి ● పంచాయతీ ఎన్నికలపై హైకోర్టులో వాదనలు ముగింపు –తీర్పు రిజర్వ్ ● 'ఎన్నికలు పెట్టండి లేదా పాతవారినే కొనసాగించండి' –హైకోర్టులో పిటిషనర్ల డిమాండ్

## వారితో కూర్చుని మీ విలువ తగ్గించుకోవద్దు..

**న్యూస్ డెస్క్, 23 జూన్ (కెరటం న్యూస్):** బలహీన వర్గాల కోసం విద్యార్థి ఉద్యమాలు చేపట్టిన పెద్దన్న, ఎంపీ ఆర్.కృష్ణయ్య అంటే మాకంతా గౌరవం ఉందని, పదేళ్లు అధికారంలో ఉండి బీసీలకు న్యాయం చేయని కవిత వంటి వారితో కూర్చుని మీ గౌరవాన్ని తక్కువ చేసుకోవద్దని అన్నారు.



## నేడు రైతు భరోసా పండుగ సంబరాలు చేసుకుందాం..

### డిప్యూటీ సీఎం భట్టి..



**న్యూస్ డెస్క్, 23 జూన్ (కెరటం న్యూస్):** రాష్ట్రవ్యాప్తంగా 9 రోజుల్లో రూ. కోట్లలో రైతు భరోసా నిధులు విడుదల చేసినట్లు తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడించారు. ఇప్పటి వరకు కోటి 49లక్షల 39వేల 111 ఎకరాలకు రైతు భరోసా అందించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని తెలిపారు. ఎకరాకు రూ.12వేల చొప్పున అన్ని వ్యవసాయ భూములకు అందించినట్లు తెలిపారు.

## డ్రగ్స్ కేసులో నటుడు శ్రీరామ్ అరెస్ట్



**న్యూస్ డెస్క్, 23 జూన్ (కెరటం న్యూస్):** కోలీవుడ్ హీరో శ్రీరామ్ మాదకద్రవ్యాల కేసులో అరెస్ట్ కావడం తమిళ చిత్ర పరిశ్రమలో తీవ్ర కలకలం రేపింది. తెలుగు ప్రేక్షకులకు కూడా సుపరిచితుడైన ఆయనను చెన్నై పోలీసులు ఈరోజు అదుపులోకి తీసుకున్నారు. ఏఐఏడీఎంకే మాజీ నేత ప్రసాద్ నుంచి శ్రీరామ్ డ్రగ్స్ కొనుగోలు చేసినట్లు ఆరోపణలు రావడంతో ఈ అరెస్ట్ జరిగింది.



## ఫోన్ ట్యాపింగ్ ఎలా జరిగింది?

# ఎవరు బాధ్యులు?

● ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో వేగం పెంచిన సిట్ ● ప్రభాకర్ రావు – ప్రణీత్ రావులను ఎదురెదురుగా విచారించనున్న సిట్ ● ఉపఎన్నికల సమయంలో భారీగా ఫోన్ ట్యాపింగ్ జరిగిందని సిట్ నిర్ధారణ ● రివ్యూ కమిటీపై అనుమానాలు – వేల ఫోన్ నెంబర్ల పంపకంపై సిట్ దర్యాప్తు

● శాంతకుమారి, రఘునందన్ రావుల స్టేట్‌మెంట్లను రికార్డ్ చేసిన సిట్

● 2018, 2023 ఎన్నికల సమయంలో ట్యాపింగ్ ద్వారా డబ్బు ప్రవాహంపై సమాచార సేకరణ ఆరోపణలు

● రెవెన్యూ, పోలీస్ అధికారుల ఫోన్లు కూడా ట్యాప్ చేసినట్టు బయటపడిన సంచలనం

**న్యూస్ డెస్క్, 23 జూన్ (కెరటం న్యూస్):** ఫోన్ ట్యాపింగ్ కేసులో ఒక్కొక్కటిగా కీలక విషయాలు బయటకు వస్తున్నాయి.. ట్యాపింగ్ ఎలా చేస్తారు.. ఎప్పుడు చేశారనే విషయాలు బయటకు వస్తున్నాయి.. రివ్యూ కమిటీ కి చైర్మన్ గా ఉన్న మాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతకుమారితో పాటు జిఐడి పొలిటికల్ సెక్రటరీ స్టేట్‌మెంట్లను పోలీసులు రికార్డ్ చేశారు.. మూడు ఉప ఎన్నికల సందర్భంగా పెద్ద ఎత్తున ట్యాపింగ్ కు పాల్పడ్డట్టు సిట్ తేల్చింది. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో కీలక విషయాలు బయటకి వస్తున్నాయి.. ఫోన్ ట్యాపింగ్ ఎలా జరిగింది? ఎలా చేశారు? ఎవరు దీనికి బాధ్యులు అనేదానిమీద సిట్ సమగ్రంగా దర్యాప్తు చేస్తుంది.. ఇప్పటికే దీనికి సంబంధించి కీలక సూత్రధారి అయిన ప్రణీత్ రావ్ ని 9 సార్లు విచారించింది..

అదే మాదిరిగా ఎస్ఐబి మాజీ చీఫ్ ప్రభాకర్ రావుని ఐదు సార్లు విచారించింది.. వీళ్ళ దగ్గర నుంచి విడివిడిగా ఇప్పటివరకు స్టేట్‌మెంట్లను రికార్డు చేశారు.. అయితే ఇద్దరిని కలిపి ఒకేసారి విచారించాలని సిట్ ఒక నిర్ణయానికి వచ్చింది.. ఎందుకంటే ఇద్దరు చెప్పున్న వాదనలు వేరువేరుగా ఉన్న నేపథ్యంలో ప్రభాకర్ రావు ప్రణీత్ లను ఎదురెదురుగా కూర్చోబెట్టి విచారణ జరిపి స్టేట్మెంట్ రికార్డ్ చేయాలని సిట్ భావిస్తుంది.. ఇప్పటివరకు ఇద్దరు చెప్పిన స్టేట్‌మెంటును రికార్డు చేశారు.. అయితే ఇద్దరు వేరు వేరు తమ వాదనలు చెప్పుకుంటూ వచ్చారు ..ఈ వాదనలను బలం చేకూర్చేందుకు ఇద్దరిని కలిపి విచారించారని సిట్ నిర్ణయం తీసుకుంది.. మరోవైపు ప్రతి రెండు నెలలకు ఒకసారి జరిగే రివ్యూ కమిటీ కీ ప్రభాకర్ రావు పెద్ద ఎత్తున ఫోన్ నెంబర్లు ఇవ్వడం జరిగింది.

ఈ ఫోన్ నెంబర్లను ఎవరు తయారు చేశారు.. ఎవరు ఫోన్ నెంబర్లను ప్రభాకర్ రావుకి ఇచ్చారని విషయాన్ని తేల్చే పనిలో సిట్ ఉంది.

## మావోయిస్టు పేరుతో బెదిరింపు కాల్..

### భయపడేది లేదు : ఎంపీ రఘునందన్‌రావు



**న్యూస్ డెస్క్, 23 జూన్ (కెరటం న్యూస్):** చంపేస్తామంటూ మావోయిస్టు పేరుతో వచ్చిన బెదిరింపు కాల్ కు భయపడేది లేదని, బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఎవరూ కూడా ఇలాంటి బెదిరింపు కాల్స్ కు ఆందోళనకు గురికాబోమని మెదక్ ఎంపీ రఘునందన్ రావు అన్నారు. ఎలాంటి పరిస్థితులు ఎదురైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. తనను చంపేస్తామంటూ మధ్యప్రదేశ్ మావోయిస్టుల పేరుతో వచ్చిన ఫోన్ కాల్ నేపథ్యంలో ఆయన తాజాగా ఓ వీడియోను రిలీజ్ చేశారు. మధ్యప్రదేశ్ పీపుల్స్ వార్ మావోయిస్టు పేరుతో ఇవాళ బెదిరింపు కాల్ వచ్చిందని రఘునందన్ రావు అన్నారు.

## అంతరిక్షంలోకి తెలుగమ్మాయి..



**న్యూస్ డెస్క్, 23 జూన్ (కెరటం న్యూస్):** ఆంధ్రప్రదేశ్ పశ్చిమగోదావరి జిల్లాలోని పాలకొల్లుకు చెందిన 23 ఏళ్ల యువతి జాహ్నవి దంగేటి అంతరిక్షంలోకి అడుగుపెడుతున్న భారతీయ మహిళగా ఘనత సాధించనుంది. అమెరికాకు చెందిన ప్రైవేట్ అంతరిక్ష పరిశోధనా సంస్థ టైటాన్ స్పేస్ ఇండస్ట్రీస్ (TSI) చేపట్టిన టైటాన్ స్పేస్ మిషన్ కోసం ఆమె Astronaut Candidate (ASCAN)గా ఎంపికయ్యారు. ఈ ప్రతిష్ఠాత్మక మిషన్‌కు NASA మాజీ వ్యోమగామి, రిటైర్డ్ కల్నల్ విలియం మెక్ ఆర్థర్ జూనియర్ నాయకత్వం వహించనున్నారు.

# ఫోన్ ట్యాపింగ్ ఎలా జరిగింది? ఎవరు బాధ్యులు?

ముఖ్యంగా మావోయిస్టుల సానుభూతిపరులు అనుచరులు అంటూ వేల కొద్ది ఫోన్ నెంబర్లను రివ్యూ కమిటీకి ప్రభాకర్ రావు ఇచ్చాడు.. అయితే ప్రభాకర్ రావు ఇచ్చిన ఫోన్ నెంబర్లను రివ్యూ కమిటీ ఎలాంటి పరిశీలన చేయకుండా కేంద్ర టెలికం శాఖకు పంపించినట్లు భావిస్తుంది.. ఇందులో భాగంగా రివ్యూ కమిటీలో ఉన్న సభ్యులను వరుసగా సిట్ విచారణ చేస్తుంది.. ఇందులో భాగంగా మాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంత కుమారితో పాటు జిఐడి పొలిటికల్ సెక్రటరీ రఘునందన్ రావుల స్టేట్‌మెంట్లను సిట్ రికార్డ్ చేసింది..

రివ్యూ కమిటీ లో అసలు ఏం జరుగుతుంది.. ఎలా ఫోన్ నెంబర్లని కేంద్ర కమ్యూనికేషన్ శాఖకు పంపిస్తారు.. రివ్యూ కమిటీకి ప్రభాకర్ రావు ఇచ్చిన ఫోన్ నెంబర్లను వెరిఫై చేస్తారా.. లేదా ప్రతిసారి ఎన్ని ఫోన్ నెంబర్లను రివ్యూ కమిటీకి ప్రభాకర్ రావు ఇచ్చాడు.. దీనిపైన చర్చ జరిగిందా ఎవరి ఫోన్ లు అని చెప్పి రివ్యూ కమిటీకి ప్రభాకర్ రావు ఇచ్చాడు అనే దానిమీద ప్రశ్నల పరంపరను కొనసాగించారు.. గత ప్రభుత్వ హయాంలో మూడు ఉప ఎన్నికలు జరిగాయి ..హుజురాబాద్ మునుగోడు దుబ్బాక ఉప ఎన్నికలు జరిగాయి.. ఈ ఉప ఎన్నికల సందర్భంగా ప్రత్యర్థులకు సంబంధించిన ఫోన్ నెంబర్లను పెద్ద మొత్తంలో ట్యాపింగ్ చేసినట్లు బయటపడింది..

అంతేకాకుండా అక్కడ పనిచేస్తున్న రెవెన్యూ పోలీస్ అధికారుల ఫోన్లను కూడా ట్యాప్ చేశారు.. కింది నుంచి పై స్థాయి వరకు ఉన్న పోలీస్ అధికారుల ఫోన్లను ట్యాప్ చేసి ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకున్నారు ..ఎవరైనా అప్పటి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పనిచేస్తే వారిపైన బదలీ వేశారు.. 2018 సాధారణ ఎన్నికల సమయంలో కూడా పెద్ద ఎత్తున ట్యాపింగ్ కు పాల్పడ్డట్టు బయటపడింది.. ఎందుకంటే ఆ సమయంలో ప్రతి పార్టీలో సంబంధించిన డబ్బులు పెద్ద ఎత్తున పట్టుకోవడం జరిగింది.. అది కూడా హైదరాబాద్ నుంచి రవాణా అవుతుంటే పట్టుకొని హవాలా డబ్బు అంటూ ఐటీ శాఖకు అప్పగించారు..

ఎప్పటికప్పుడు డబ్బు రవాణా మీద దృష్టి పెట్టి ఆమెరకు సమాచారాన్ని టాస్క్ ఫోర్స్ డీసీపీ రాధా కిషన్ కి అందించాడు.. రాధా కిషన్ తన టీముని రంగంలోకి దించి ఆ డబ్బులు పట్టుకొని హైదరాబాద్ పోలీస్లకు అప్పగించేవాడు.. ఇలా 2018 ,2023 సాధారణ ఎన్నికల్లో కూడా డబ్బు ప్రవాహానికి సంబంధించిన సమాచారాన్ని రాధాకృష్ణ పట్టుకోవడం జరిగింది.. సాధారణ ఎన్నికల్లో చాలామంది పార్టీలకు సంబంధించిన పై స్థాయి నుంచి కిందిస్థాయి నాయకుల ఫోన్లను ట్యాప్ చేశారు.. వాళ్లందర్నీ ఇప్పుడు సిట్ పిలిచి విచారణ చేపడుతోంది.

# పంచాయతీ ఎన్నికలకు నెల రోజుల టైం ఇవ్వండి : హైకోర్టులో ప్రభుత్వం

తాజాగా ఇవాళ మరోసారి విచారణకు రాగా పిటిషనర్లు, రాష్ట్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘం వాదనలు పూర్తి కావడంతో స్థానిక సంస్థలపై హైకోర్టు తీర్పును రిజర్వ్ చేసింది.

30 రోజుల గడువివ్వండి:

విచారణ సందర్భంగా ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం 30 రోజులు, ఎన్నికల సంఘం 60 రోజుల పాటు గడువు కావాలని హైకోర్టును కోరాయి. రిజర్వేషన్లు, వార్డు డివిజన్ ప్రక్రియ పూర్తి కావడానికి ప్రభుత్వం గడువు కోరగా ప్రభుత్వం వైపు నుంచి క్లియరెన్స్ వస్తే ఎన్నికలు నిర్వహించేందుకు తమకు రెండు నెలల పాటు సమయం కావాలని ఎన్నికల సంఘం కోర్టుకు తెలిపింది. అయితే గత ఫిబ్రవరిలోనే ఎన్నికలు నిర్వహిస్తామని చెప్పిన ప్రభుత్వం ఆ దిశగా ప్రయత్నాలు చేయలేదని పిటిషనర్ తరపు న్యాయవాదులు కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఎన్నికల నిర్వహణ విషయంలో గత విచారణలోనే చెప్పినట్లుగా ప్రభుత్వం ఎందుకు ఎన్నికలు నిర్వహించలేదని కోర్టు ప్రభుత్వాన్ని ప్రశ్నించింది.

ఆగస్టు తర్వాతే లోకల్ బాడీ ఎన్నికలు:

అయితే స్థానిక ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం సమయాత్తం అవుతున్నదన్న ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే పంచాయతీరాజ్ అధికారులు, ఎన్నికల నిర్వహణకు సంబంధించి కసరత్తు పూర్తి చేస్తున్నాయి. ఎన్నికల విషయంలో మంత్రులు సైతం వ్యాఖ్యలు చేయడం రాజకీయంగా ఇంట్రెస్ట్ ను పెంచుతోంది. అయితే కులగణన, బీసీల రిజర్వేషన్ అంశం సైతం కోర్టు పరిధిలో ఉంది. ఈ నేపథ్యంలో రిజర్వ్ చేసిన తీర్పులో ఏముంది? ప్రభుత్వానికి ఎలాంటి ఆదేశాలు జారీ కానున్నాయనేది సస్పెన్స్ గా మారింది. ప్రభుత్వం, ఈసీ వాదనలను కోర్టు పరిగణలోకి తీసుకుంటే స్థానిక సంస్థల ఎన్నికలు ఆగస్టు తర్వాతే జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# నేడు రైతు భరోసా పండుగ.. సంబరాలు చేసుకుందాం.. డిప్యూటీ సీఎం భట్టి..



**న్యూస్ డెస్క్, 23 జూన్ (కెరటం న్యూస్):** రాష్ట్రవ్యాప్తంగా 9 రోజుల్లో రూ. కోట్లలో రైతు భరోసా నిధులు విడుదల చేసినట్లు తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడించారు. ఇప్పటి వరకు కోటి 49లక్షల 39వేల 111 ఎకరాలకు రైతు భరోసా అందించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని తెలిపారు. ఎకరాకు రూ.12వేల చొప్పున అన్ని వ్యవసాయ భూములకు అందించినట్లు తెలిపారు. గాంధీభవన్‌లో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన జై బాపు, జైభీమ్, జై సంవిధాన్ కో ఆర్డినేటర్ల సమావేశంలో భట్టి విక్రమార్క పాల్గొని మాట్లాడారు. ఈ సమావేశంలో ఏఐసీసీ ఇంఛార్జ్ మీనాక్షి నటరాజన్, సీడబ్ల్యూసీ సభ్యులు వంశీచంద్‌రెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి విశ్వనాథం, రాష్ట్ర గ్రంథాలయ ఛైర్మన్ రియాజ్ తదితరులు పాల్గొన్నారు. రైతు భరోసా కింద నిధులను రైతుల ఖాతాల్లో ఈ నెల 16 నుంచి జమ చేస్తున్నామని.. ఇది జూన్ 24తో పూర్తవుతుందని భట్టి వివరించారు. ఈ సందర్భంగా మంగళవారం సాయంత్రం 4 గంటలకు అన్ని మండల కేంద్రాల్లో రైతు భరోసా సంబరాలు పెద్ద ఎత్తున చేపట్టాలని సూచించారు.

# ఏసీబీకి చిక్కిన జీహెచ్ఎంసీ ఏఈ మనీషా.. రూ.15 వేలు లంచం తీసుకుంటూ..



**న్యూస్ డెస్క్, 23 జూన్ (కెరటం న్యూస్):** తెలంగాణ వ్యాప్తంగా వరుసగా ఏసీబీ అధికారులు రైడ్స్ చేస్తూ లంచగొండి అధికారులను అరెస్ట్ చేస్తున్న విషయం తెలిసిందే. ఎంత మందిని అరెస్ట్ చేసిన కొంత మంది అధికారుల తీరు మాత్రం మారట్లేదు. ఇంకా టేబుల్ కింద చేయి చాపుతూనే ఉన్నారు. తాజాగా మరో అధికారిని లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కింది. రూ.15 వేలు లంచం తీసుకుంటూ జీహెచ్ఎంసీ ఏఈ మనీషా ఏసీబీకి చిక్కింది.

అంబర్‌పేట జీహెచ్ఎంసీ కార్యాలయంలో బిల్లులు ఆమోదం చేసేందుకు ఇంజనీర్ ఏఈ మనీషా రూ.20,000 లంచం డిమాండ్ చేసింది. బాధితుడి ఫిర్యాదుతో జీహెచ్ఎంసీ కార్యాలయం పై ఏసీబీ రైడ్ చేసింది. ఇది వరకే రూ. 5 వేలు లంచం ఇచ్చాడు బాధిత కాంట్రాక్టర్. ఈ క్రమంలోనే ఏఈ మనీషా రూ.15,000 లంచం తీసుకుంటుండగా.. ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడింది.

# డీటీ రాజేష్ ఖన్నాకు అండగా నిలిచిన ఉద్యోగుల జేఏసీ



మిగిలిన రూ.7 లక్షలు చెల్లించే పరిస్థితి ఆ కుటుంబానికి లేదు. మిగతా రూ. 7 లక్షలు చెల్లిస్తేనే డిశ్చార్జి చేస్తామని ఆస్పత్రి వారు తెగించి చెప్పారు. రాజేష్ ఖన్నా, అతడి కుటుంబం యొక్క దయానీయ పరిస్థితి తెలుసుకున్న తెలంగాణ ఉద్యోగుల జేఏసీ ఛైర్మన్ వి.లచ్చిరెడ్డి, టీజీటీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్ పాకతో కలిసి ఆస్పత్రికి వెళ్లారు. రాజేష్‌ఖన్నాకు, అతడి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. అన్ని రకాలుగా తాము అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అప్పటికప్పుడే ఆస్పత్రిలో బిల్లుల విషయమై నిర్వాహకులతో మాట్లాడారు. మిగతా చెల్లించాల్సిన రూ.7 లక్షలు చెల్లించకుండానే సెటిల్(మాఫీ) చేసి రాజేష్ ఖన్నాను డిశ్చార్జి చేసేలా ఏర్పాటు చేశారు.

# కాళేశ్వరం ప్రాజెక్టు ముమ్మాటికి అవినీతి ప్రాజెక్టే : ఎమ్మెల్యే రాజాసింగ్

**న్యూస్ డెస్క్, 23 జూన్ (కెరటం న్యూస్):** కాళేశ్వరం ప్రాజెక్టు ముమ్మాటికి అవినీతి ప్రాజెక్టే అని బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. దమ్ముంటే కాళేశ్వరం ప్రాజెక్టుపై సీబీఐ దర్యాప్తు చేపట్టాలని లేఖ రాయాలన్నారు. కాళేశ్వరం అవినీతిపై బండి సంజయ్ ఆధారాలతో సహా బయటపెట్టగానే బీఆర్ఎస్ నాయకుల అవాకులు చవాకులు పేలుతున్నాయని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును ఒక ఏటీఎంగా బీఆర్ఎస్ నాయకులు వాడుకున్నారని అన్నారు. దాని గురించి బండి సంజయ్ మాట్లాడారని చెప్పారు. అది వాస్తవమో కాదో బీఆర్ఎస్ నాయకులు బయటపెట్టాలని అన్నారు. బండి సంజయ్ తప్పుగా మాట్లాడి ఉంటే బీఆర్ఎస్ నాయకులు సీబీఐ దర్యాప్తుకు లేఖ రాయాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు మాత్రమే కాకుండా తెలంగాణలోని ఇతర ప్రాజెక్టుల్లోనూ మీరు ఎంత అవినీతి చేశారో బండి సంజయ్ చెబుతారని అన్నారు. బండి సంజయ్ మాట్లాడింది వందశాతం నిజం అని, తప్పుగా మాట్లాడి ఉంటే బీఆర్ఎస్ నిరూపించుకోవాలని అన్నారు.

# వారితో కూర్చుని మీ విలువ తగ్గించుకోవద్దు.. - మంత్రి పొన్నం ప్రభాకర్




**న్యూస్ డెస్క్, 23 జూన్ (కెరటం న్యూస్):** బీసీ బిల్లుకు రాజకీయ రంగు పులమడం సరికాదని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మండిపడ్డారు. పదేళ్లు అధికారంలో ఉండి బీసీల గురించి మాట్లాడని ఎమ్మెల్సీ కవితకు ఇప్పుడు బీసీలు గుర్తుకు రావడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. ఇవాళ గాంధీ భవన్ లో మీడియాతో మాట్లాడిన ఆయన బీసీల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందని, మా ప్రభుత్వం బీసీ బిల్లును అసెంబ్లీలో అమోదింపచేసుకుని గవర్నర్ కు పంపినట్లు ఆయన గుర్తు చేశారు. బడుగుల పట్ల రాజకీయాలకు అతీతంగా కలిసిరావాలని పిలుపునిచ్చారు.

బలహీన వర్గాల కోసం విద్యార్థి ఉద్యమాలు చేపట్టిన పెద్దన్న, ఎంపీ ఆర్.కృష్ణయ్య అంటే మాకంతా గౌరవం ఉందని, పదేళ్లు అధికారంలో ఉండి బీసీలకు న్యాయం చేయని కవిత వంటి వారితో కూర్చుని మీ గౌరవాన్ని తక్కువ చేసుకోవద్దని అన్నారు. కేంద్రానికి బీసీ బిల్లును పంపించామని దాన్ని ఆమోదింపజేసుకునేందుకు ఆర్. కృష్ణయ్య ప్రధాని నరేంద్ర మోడీ అపాయింట్ మెంట్ తీసుకోవాలని మోడీని అందరం కలుద్దామన్నారు. కవిత చేపట్టిన బీసీ రిజర్వేషన్ల ఉద్యమానికి మద్దతు ఇవ్వాలన్న ఆర్.కృష్ణయ్య పిలుపుకు మంత్రి పొన్నం ఈ సందర్భంగా కౌంటర్ ఇచ్చారు.

# మావోయిస్టు పేరుతో బెదిరింపు కాల్.. భయపడేది లేదు: ఎంపీ రఘునందన్‌రావు

**న్యూస్ డెస్క్, 23 జూన్ (కెరటం న్యూస్):** చంపేస్తామంటూ మావోయిస్టు పేరుతో వచ్చిన బెదిరింపు కాల్ కు భయపడేది లేదని, బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఎవరూ కూడా ఇలాంటి బెదిరింపు కాల్స్ కు ఆందోళనకు గురికాబోమని మెదక్ ఎంపీ రఘునందన్ రావు అన్నారు. ఎలాంటి పరిస్థితులు ఎదురైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. తనను చంపేస్తామంటూ మధ్యప్రదేశ్ మావోయిస్టుల పేరుతో వచ్చిన ఫోన్ కాల్ నేపథ్యంలో ఆయన తాజాగా ఓ వీడియోను రిలీజ్ చేశారు. మధ్యప్రదేశ్ పీపుల్స్ వార్ మావోయిస్టు పేరుతో ఇవాళ బెదిరింపు కాల్ వచ్చిందని రఘునందన్ రావు అన్నారు. మేడ్చల్ జిల్లా దమ్మాయిగూడెంలోని ఓ పాఠశాల కార్యక్రమంలో ఉండగా o912143352974 నంబర్ నుంచి తనకు ఫోన్ చేసి ఇప్పుడే మధ్యప్రదేశ్ నుంచి మావోయిస్టు పార్టీ దళం బయలుదేరింది. ఇవాళ అర్ధరాత్రి లోపు మెదక్ ఎంపీ రఘునందన్ రావును చంపేస్తామని హెచ్చరించారని చెప్పారు. ఈరోజు అర్థరాత్రి వరకే డెడ్ లైన్ అని జాగ్రత్తగా ఉండమని హెచ్చరిస్తూ రెండోసారి కూడా ఫోన్ చేశారన్నారు. ఆపరేషన్ కగార్ ను ఆపేందుకు మావోయిస్టు పార్టీ ఏదైనా సెన్సేషన్ కోసం ప్రయత్నిస్తోందా? తెలియడం లేదన్నారు. ఈ క్రమంలో ఎవరిని బలితీసుకోబోతున్నారో అనేది తాము ఆందోళన చెందడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు.

# డ్రగ్స్ కేసులో నటుడు శ్రీరామ్ అరెస్ట్



వివరాల్లోకి వెళితే, చెన్నై నార్కోటిక్స్ ఇంటెలిజెన్స్ యూనిట్ పోలీసులు డ్రగ్స్ కేసు విచారణలో భాగంగా నటుడు శ్రీరామ్‌ను అరెస్ట్ చేశారు. అరెస్ట్ అనంతరం ఆయనను రాజీవ్ గాంధీ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్య పరీక్షలు నిర్వహించారు. అక్కడ శ్రీరామ్ రక్త నమూనాలను సేకరించినట్లు సమాచారం. ఆ తర్వాత నుంగంబాక్కం పోలీస్ స్టేషన్‌కు తరలించి సుమారు రెండు గంటల పాటు అధికారులు ఆయన్ను విచారించారు.

ఈ డ్రగ్స్ కేసులో ఇప్పటికే అన్నాడీఎంకే మాజీ నేత ప్రసాద్ తో పాటు మరో ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. వారిని విచారించినప్పుడు లభించిన సమాచారం ఆధారంగా నటుడు శ్రీరామ్‌ను కూడా అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్నట్లు తెలుస్తోంది.

తిరుపతికి చెందిన శ్రీకాంత్, సినిమాల్లో అవకాశాల కోసం చిన్న వయసులోనే చెన్నైకి వెళ్లారు. అక్కడ తన పేరును శ్రీరామ్‌గా మార్చుకుని, తొలుత చిన్న పాత్రలు పోషించారు. రోజా పూలు సినిమాతో తెలుగు, తమిళ భాషల్లో హీరోగా పరిచయమయ్యారు. ఆ తర్వాత 'ఒకరికి ఒకరు' సినిమాతో మంచి గుర్తింపు తెచ్చుకుని, తెలుగు, తమిళ, కన్నడ భాషల్లో పలు చిత్రాల్లో నటించారు. ఇటీవలే హరికథ అనే వెబ్ సిరీస్‌లో కూడా శ్రీరామ్ కనిపించారు. ప్రముఖ దర్శకుడు శంకర్ దర్శకత్వంలో, విజయ్ హీరోగా వచ్చిన 'స్నేహితులు' చిత్రంలో జీవాతో కలిసి శ్రీరామ్ కీలక పాత్ర పోషించారు. ప్రస్తుతం శ్రీరామ్ అరెస్ట్ వార్త చెన్నై సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ఈ కేసు విచారణలో మరిన్ని విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు.

# ఆగిపోయే శ్వాసకు రక్తదానంతో ఊపిరి పోద్దాం



రక్తదానం పుణ్య కర్మ, ప్రతి చుక్కకు ప్రాణం పోసే శక్తి ఉందని వారు తెలిపారు. అంకుర హాస్పిటల్స్ లో అత్యధిక వైద్య సేవలతో పాటు సేవా భావంతో కూడిన రక్తదాన శిబిరం లాంటి విలువైన సేవ కార్యక్రమాలు నిర్వహించడం గొప్ప విషయం అన్నారు. జీవితంలో ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి రక్తం అవసరం ఉన్నవారిని ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకు కృషి చేయాలన్నారు.

రక్తదాన శిబిరానికి యువత నుండి సందన...

సోమవారం ఆయు పౌండేషన్ హైదరాబాద్ ఆధ్వర్యంలో ఖమ్మం అంకుర హాస్పిటల్స్ నిర్వహించిన రక్తదాన శిబిరానికి యువత నుండి మంచి స్పందన లభించింది. పలు ప్రాంతాలకు చెందిన యువత స్వచ్ఛందంగా రక్తదాన శిబిరంలో పాల్గొని రక్త దానం చేశారు. అంకుర హాస్పిటల్స్ నిర్వహించే ప్రతి ప్రజా ప్రయోజన కార్యక్రమంలో తాము భాగస్వాములమై కలిసి పనిచేస్తామని యువత తెలిపారు. హైదరాబాద్ ఆయు పౌండేషన్ ఆధ్వర్యంలో అంకుర హాస్పిటల్స్ లో జరిగిన ఈ కార్యక్రమంలో అంకుర హాస్పిటల్స్ వైద్యులు డాక్టర్ జోత్స్న, డాక్టర్ సింధు, డాక్టర్ అపర్ణ, డాక్టర్ కల్పన, డాక్టర్ జాకీర్, డాక్టర్ కోటేశ్వరరావు, డాక్టర్ శ్వేత, అంకుర హాస్పిటల్స్ మేనేజర్ కందిమళ్ల రామారావు, నాగండ్ల అన్వేష్, యువం పౌండేషన్ ప్రధాన కార్యదర్శి కుక్కల రాజా, యువం పౌండేషన్ బాధ్యులు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# రప్పా రప్పా జైలులో వేయాలి: ధర్మపురి అరవింద్



**న్యూస్ డెస్క్, 23 జూన్ (కెరటం న్యూస్):** బీఆర్ఎస్ పార్టీ అవినీతిలో కూరుకుపోయిందని బీజేపీ నేత, నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ మండిపడ్డారు. ఈ నేపథ్యంలో ఆ పార్టీ నేతలను రప్పా రప్పా జైలులో వేయాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. వచ్చే ఎన్నికల్లో ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌కు ఓటమి తప్పదన్నారు. ఆ ఎన్నికల్లో హరీష్ రావు తప్ప ఎవరూ విజయం సాధించరని ఎంపీ ధర్మపురి అరవింద్ జోస్యం చెప్పారు.

ఇక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉదయం బెదిరించి.. సాయంత్రం మిలాఖత్ అయితే.. కాంగ్రెస్ పార్టీకి పుట్టగతులుండవంటూ మండిపడ్డారు. సోమవారం నిజామాబాద్‌లో ఎంపీ ధర్మపురి అరవింద్ విలేకర్లతో మాట్లాడుతూ.. జూన్ 29వ తేదీన నిజామాబాద్ జిల్లాలో కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా పర్యటించనున్నారని తెలిపారు. పసుపు బోర్డు కార్యాలయాన్ని ఆయన ప్రారంభించనున్నారని చెప్పారు. నిజామాబాద్ వేదికగా పసుపు బోర్డు ఏర్పాటుతో రైతులకు కొత్త శకం ప్రారంభమైందన్నారు. అలాగే దివంగత నేత డి. శ్రీనివాస్ విగ్రహావిష్కరణ చేయనున్నట్లు వివరించారు. అనంతరం స్థానిక పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో రైతు సమ్మేళనం పేరిట కార్యక్రమం నిర్వహిస్తామని ఎంపీ అరవింద్ పేర్కొన్నారు.

# ఉపాధి హామీ పని దినాలు పెంచాలి: మంత్రి సీతక్క

**న్యూస్ డెస్క్, 23 జూన్ (కెరటం న్యూస్):** తెలంగాణలో ఉపాధి హామీ పనులు జోరుగా కొనసాగుతున్నాయి.



కేంద్రం కేటాయించిన ఆరున్నర కోట్ల పనిదినాల్లో ఇప్పటికే 4.53 కోట్ల పని దినాలను తెలంగాణ పూర్తి చేసింది. అంటే మొత్తం కేటాయించిన పనిదినాల్లో 70 శాతం టార్గెట్ ను తెలంగాణ రీచ్ అయ్యింది. అయితే గతంలో మాదిరిగా 12 కోట్ల పని దినాలు తెలంగాణకు కేటాయించాలని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క కేంద్ర ప్రభుత్వానికి ఇప్పటికే లేఖ రాశారు. పని దినాలు రెట్టింపు చేయాలని కేంద్రాన్ని కోరనున్నట్లు మంత్రి తెలిపారు. కేంద్రం నుంచి అనుమతులు వస్తాయన్న నమ్మకంతో ఉపాధి హామీ పనులను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వేగవంతం చేసింది.

28.48 లక్షల మంది ఉపాధి...

ఈ ఏడాది ఇప్పటి వరకు 18.9 లక్షల కుటుంబాల్లోని 28.48 లక్షల మంది ఉపాధి కూలీలకు పని కల్పించారు. ఒక్కో కుటుంబం సగటున 24 రోజుల పని దినాలను పూర్తి చేసుకుంది. 1127 కుటుంబాలు వంద రోజుల పనిదినాలను పూర్తి చేసుకున్నాయి. అయితే సగటున ఒక్కో కూలీకి రూ. 250.75 రోజువారి వేతనం లభిస్తుంది. అయితే రోజు వారి వేతనం రూ.307 దక్కెలా చర్యలు తీసుకుంటున్నారు. ఎప్పటికప్పుడు క్షేత్ర స్థాయి సిబ్బందిని అప్రమత్తం చేస్తూ కూలీ గిట్టుబాటు అయ్యేలా చర్యలు చేపడుతున్నారు.

వ్యవసాయ అనుబంధ పనులకు ప్రాధాన్యం

ఉపాధి హామీ పనుల్లో భాగంగా వ్యవసాయ అనుబంధ పనులకు తెలంగాణ ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోంది. ఉపాధి హామీ పనుల్లో 60 శాతం పనులు వ్యవసాయ అనుబంధ పనులు చేయించాలని లక్ష్యం పెట్టుకోగా.. వ్యవసాయ అనుబంధ పనులు 50 శాతంగా నమోదయ్యాయి. ఇందులో ప్రధానంగా ఫాం పాండ్స్, పశువుల కొట్టాలు, మొక్కల నాటింపు వంటి పనులు లక్షకు పైగా కొనసాగుతున్నాయి. జీపీ భవనాలు, అంగన్వాడీ భవనాలు, సీసీ రోడ్ల వంటి మళిక వసతుల కల్పన పనులు లక్షా 31 వేలకు పైగా కొనసాగుతున్నాయి. అయితే ఉపాధీ హామీ పనుల్లో ఉపాధి కల్పన తో పాటు గ్రామీణ ప్రాంతాల్లో సదుపాయాల కల్పన, ఆస్థుల సృష్టి కి తెలంగాణ ప్రభుత్వం అధిక ప్రధాన్యతనిస్తోంది.

కేంద్ర ప్రభుత్వ తీరుతో అసంతృప్తి.. మంత్రి సీతక్క లేఖ..

మే నెల ముగిసే నాటికి ఉపాధి హామీలో భాగంగా రూ. 1416 కోట్లను ప్రభుత్వం ఖర్చు చేసింది. అందులో రూ.1151.67 కోట్లు వేతనాలు కాగా, రూ.191.03 కోట్లు మేటిరియల్ కాంపోనెంట్ గా నమోదు అయ్యింది. అయితే కేంద్రం నుంచి నిధుల విడుదలతో జాప్యం అయినా కూలీలకు ఇబ్బందులు లేకుండా రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు వేతనాలను ఉపాధి కూలీల ఖాతాల్లో జమచేస్తోంది. ఇప్పటి వరకు కూలీల ఖాతాల్లో 733.52 కోట్లు జమ అయ్యాయి. అయితే ఉపాధి హామీ పనులకు తెలంగాణలో భారీ డిమాండ్ ఉంది. మరీ ముఖ్యంగా వ్యవసాయ అనుబంధ పనులకు ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తుండటంతో, ఉపాధి పనులకు ప్రజలు మొగ్గు చూపుతున్నారు. అయితే గత ఏడాదిత పోలిస్తే ఉపాధి పనిదినాలను సగానికి కేంద్ర ప్రభుత్వం కుదించింది. దీనిపై తన అసంతృప్తిని వ్యక్తం చేస్తూ కేంద్ర ప్రభుత్వానికి మంత్రి సీతక్క ఇప్పటికే లేఖ రాశారు. అపాయింట్ మెంట్ రాగానే కేంద్ర పెద్దలను కలసి ఉపాధి పని దినాలను కనీసం 12 కోట్లకు పెంచాలని విజ్ఞప్తి చేయనున్నారు.

# పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్ళు తక్షణమే మంజూరు చేయాలి

## కొత్తగూడెం కార్పొరేషన్ లో పారిశుద్ధ్య పనులు మెరుగుపరచాలి
## దోమల నివారణకు చర్యలు చేపట్టి, మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించాలి
## కొత్తగూడెం మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి
## కొత్తగూడెం కార్పొరేషన్ కార్యాలయం ఎదుట నిరసన



**కొత్తగూడెం,23 జూన్ (కెరటం న్యూస్):** భారత రాష్ట్ర సమితి పార్టీ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు ఆదేశాలు, మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు సూచన మేరకు సోమవారం కొత్తగూడెం కార్పొరేషన్ కార్యాలయం ఎదుట బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కొత్తగూడెం మున్సిపాలిటీ మాజీ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. అనంతరం కొత్తగూడెం కార్పొరేషన్ మేనేజర్ ప్రసాద్ కు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. అనంతరం సీతాలక్ష్మీ మాట్లాడుతూ.. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచాలని అన్నారు. వెంటనే దోమల నివారణకు దోమల మందు పిచికారి చేయించాలని సూచించారు. కొత్తగూడెంలో అర్హులైన పేదలందరికీ తక్షణమే ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కొత్తగూడెం పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితాను నోటీస్ బోర్డులో ప్రదర్శించాలని కోరారు. అన్ని వీధుల్లో వీధి దీపాలు ఏర్పాటు చేయాలన్నారు. డ్రైనేజీలో పేరుకుపోయిన వ్యర్థాలను వెంటనే తొలగించాలని చెప్పారు. మిషన్ భగీరథ పథకం కోసం ఎక్కడికక్కడ పైప్ లైన్ ల కోసం తవ్విన గుంటలను పూడ్చి రోడ్లకు మరమ్మతులు చేపట్టాలి. తవ్విన గుంటల వల్ల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు అనే నినాదాన్ని సీఎం రేవంత్ రెడ్డి మరిచారని విమర్శించారు. హరితహారం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించాలని తెలిపారు. ఈ నిరసన ధర్నాలో మాజీ కౌన్సిలర్లు ప్రసాద్, పల్లపు రాజు, మైనారిటీ సెల్ నాయకులు ఖాజా భక్ష్, మునీర్, హుస్సేన్, ఎస్సీ సెల్ రామిళ్ళ మధు, ఎస్టీ సెల్ నాయకులు పూర్ణచందర్, అజ్మీరా విజయ్, రాజ మల్లయ్య, షమ్మీ, మొయినుద్దీన్, సూరి, అశోక్, నగేష్, బాబు జానీ, నాగ రాజు, మజీద్, అన్వర్ ఖాజా, తుంగ కనకయ్య, ఆర్ శ్రీనివాస్,వెంకట రమణ,రమేష్ శ్రీదేవి, శైలజ, కోమల, శ్రీనిజ, సుందర్ పాసి, టింకు, సోనీ పాసి, సౌజన్య, ఆశ, మాధవి, స్వర్ణ, లక్ష్మి, కమల, విజయ, జి విజయ, సుహాని, మహేశ్వరి, రమణ, శ్రావణ్, నసీమా, మహబూబ్, షేక్ బాజీ, షేక్ బిబి, సత్యవతి, ఖంరుణ్నిసా, షణ్ముఖ, సిద్దు, బన్ను, అమన్, తదితరులు పాల్గొన్నారు.




## శారద ప్యూరిఫైడ్ డ్రింకింగ్ వాటర్ ప్లాంట్ ను ప్రారంభించిన మేయర్ నీరజ

### సందర్శించిన ఏసీపీలు రమణమూర్తి, తిరుపతి రెడ్డి, సాంబరాజు




**ఖమ్మం టౌన్,23 జూన్ (కెరటం న్యూస్):** ఖమ్మం నగరంలోని 16వ డివిజన్ దంసలాపురం కొత్త కాలనీలో సోమవారం నూతనంగా శారద ప్యూరిఫైడ్ డ్రింకింగ్ వాటర్ ను నగర మేయర్ పునుకొల్లు నీరజ ప్రారంభించారు. 16 డివిజన్ కార్పొరేటర్ మేడారపు వెంకటేశ్వర్లు, నాయకులు ఆళ్ల అంజిరెడ్డి, మందడపు బ్రహ్మారెడ్డి లతో కలిసి శారద ప్యూరిఫైడ్ డ్రింకింగ్ వాటర్ ప్లాంట్లు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. వాటర్ ప్లాంట్ లోని మిషన్లను ఆన్ చేసి ప్యూరిఫైడ్ సిస్టం ను పరిశీలించారు. ప్రజలకు స్వచ్ఛమైన నాణ్యమైన త్రాగునీటిని అందించాలన్నారు. వాటర్ ప్లాంట్ నిర్వాహకురాలు నల్లి శారద కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బండారు నరసయ్య, బసవమ్మ డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.

నూతన వాటర్ ప్లాంట్ ను సందర్శించిన ఏసీపీలు.

ఖమ్మం నగరంలోని దంసలాపురం ప్రాంతంలో నూతనంగా ఏర్పాటు చేసిన శారద ప్యూరిఫైడ్ డ్రింకింగ్ వాటర్ ప్లాంట్ ను ఖమ్మం టౌన్ ఏసిపి రమణమూర్తి, ఖమ్మం రూరల్ ఏసిపి తిరుపతిరెడ్డి, ఎస్బి ఏసిపి సాంబరాజు సందర్శించి వాటర్ ప్లాంట్ నిర్వాహకురాలు నల్లి శారదను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. స్వచ్ఛమైన నాణ్యమైన త్రాగునీటిని ప్రజలకు అందించాలని కోరారు.

## రైతుల ఖాతాల్లో 406 కోట్ల 36 లక్షల రైతు భరోసా నిధులు జమ

### జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



**ఖమ్మం బ్యూరో,23 జూన్ (కెరటం న్యూస్):** రైతుల ఖాతాల్లో ఇప్పటి వరకు 406 కోట్ల 36 లక్షల రైతు భరోసా నిధులు జమ చేసామని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 3 లక్షల 53 వేల 794 మంది రైతుల ఖాతాల్లో మొత్తం 436 కోట్ల 84 లక్షల 65 వేల 365 రూపాయలు జమ చేయాల్సి ఉండగా, ఇప్పటి వరకు 15 ఎకరాల వరకు వున్న 3 లక్షల 31 వేల 397 మంది రైతులకు 406 కోట్ల 36 లక్షల 62 వేల 570 రూపాయలను రైతు భరోసా వానాకాలం - 2025 క్రింద రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## గ్రామ కార్యదర్శి బదిలీపై జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు

**ఖమ్మం టౌన్,23 జూన్ (కెరటం న్యూస్):** పువ్వాడ ఉదయం నగర్ కాలనీ గ్రామ కార్యదర్శి బదిలీ అంశంపై సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్ సందర్భంగా వీర నారీమణుల ఆశయ సాధన సమితి ఆధ్వర్యంలో ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం గ్రామ కార్యదర్శిగా వ్యవహరిస్తున్న వ్యక్తి గ్రామంలో అనేక కబ్జాలకు పాల్పడటం , గ్రామసభలు నిర్వహించకపోవడం , పంచాయతీ నిధులను దుర్వినియోగపర్చటం , లంచాలు మరగడం ,దొంగ పట్టాలు జారీ చేయడం , దొంగ ధ్రువపత్రాల ద్వారా కరెంటు మీటర్లకు , ఇంటి నెంబర్లను సృష్టించడం చేశాడని వినతి పత్రంలో ఆరోపించారు. గతంలో అనేక ఫిర్యాదులు చేసినప్పటికీ అధికారులు పట్టించుకోలేదని , గ్రామ కార్యదర్శి బదిలీ చేయమని ఆర్డర్లు ఉన్నప్పటికీ బదిలీ చేయకపోవడం గురించి వివరంగా వినతి పత్రంలో ప్రస్తావించారు. ఇటీవల బదిలీ అయిన జిల్లా కలెక్టర్ ముజమిల్ ఖాన్ గ్రామ కార్యదర్శి పై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో బదిలీ చేయాలని ఆదేశించిన విషయాన్ని వినతి పత్రంలో పేర్కొన్నారు. గతంలోనే ఈ గ్రామ కార్యదర్శిని ఈ ఆరోపణ క్రమంలో ఇక్కడి నుండి బదిలీ చేసిన తిరిగి ఇక్కడికే పోస్టింగ్ తెచ్చుకున్న విషయాన్ని తెలిపారు. ఖమ్మం నగరం మమత కాలేజీ సమీపంలోని రామచంద్రయ్య నగర్ లో గుడిసెలు వేసుకొని నివసిస్తున్న నిరుపేదల ఇళ్లకు ఇంటి నెంబర్లు కేటాయించడంతోపాటు కరెంటు మీటర్లు పెట్టాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి , జిల్లా పంచాయతీ అధికారి కీ ఈ విషయంపై ప్రశ్నిస్తూ వెంటనే ఈ అంశాన్ని పరిష్కరించాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం సమర్పించిన బృందంలో వీరనారీ మణుల ఆశయ సాధన సమితి జిల్లా అధ్యక్షురాలు భూక్యా ఉపేంద్ర బాయి , లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు బానోతు బద్రు నాయక్ , ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ ప్రజాసంఘాల నాయకులు పగిడిపల్లి నాగేశ్వరరావు , నాయకులు సరోజిని, త్రివేణి , రామన్న , రేణుక, యాకేష్ , సంజీవరావు, అఖిల్ తదితరులు ఉన్నారు.



## సమస్యలు పరిష్కరించాలని బిఆర్ఎస్ వినతి



**కొత్తగూడెం,23 జూన్ (కెరటం న్యూస్):** బిఆఎస్ పార్టీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు రేగా కాంతారావు ఆదేశాల మేరకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం నియోజకవర్గం లక్ష్మీదేవిపల్లి మండలం రేగళ్ల పెద్ద తండా గ్రామపంచాయతీ నందు బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగినది. అర్హులైన ప్రతి పేదవారికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని, సైడ్ కాలవలలో చెత్త చెదారం పిచ్చి మొక్కలను తొలగించి పంచాయతీలో పారిశుద్ధ్యం బ్లీచింగ్ పౌడర్ శానిటేషన్ చేయాలని, ఇండ్లలోని చెత్తను ప్రతిరోజు సేకరించి డంపు యాడుకు తరలించాలని డిమాండ్ చేశారు. దోమల నివారణ చర్యలు వెంటనే తీసుకోవాలని, పైలెట్ ప్రాజెక్టుగా తీసుకున్నటువంటి గ్రామపంచాయతీలలో స్పెషల్ ఆఫీసర్స్ ను తక్షణమే నియమించాలని ఈ సమస్యలన్నీటిని తక్షణమే పరిష్కరించాలని ధర్నాలు చేస్తూ రేగళ్ల పెద్ద తండా పంచాయతీ సెక్రెటరీకి మెమోరాండా ఇవ్వడం జరిగినది. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల కార్యదర్శి లావుడ్య పూర్ణ, నాయకులు భూక్యా సాగర్, లావుడ్య శ్రీహరి, నువ్వు నాతో రమేష్, అరుణ్, గూగులోత్ వీరన్న, మహిళా కార్యకర్తలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## డివైఎస్ఓ ఆధ్వర్యంలో విజయవంతంగా ఒలంపిక్ రన్

### పాల్గొన్న ఎమ్మెల్యే కూనంనేని కలెక్టర్ జితేష్ పాటిల్



**కొత్తగూడెం స్పోర్ట్స్,23 జూన్ (కెరటం న్యూస్):** ఒలంపిక్ డే రన్ సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా డీవైఎస్ఓ పరంధామ రెడ్డి ఆధ్వర్యంలో ఒలంపిక్ డే రన్ స్థానిక రైల్వే స్టేషన్ ప్రాంగణంలో సోమవారం నిర్వహించారు. ఈ ఒలంపిక్ డే రన్ కు ముఖ్య అతిథులుగా కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్, సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్కె సాబీర్ పాష,టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగ సీతారాములు పాల్గొని ఒలంపిక్ జ్యోతిని వెలిగించి ఒలంపిక్ డే రన్ ను ప్రారంభించారు. ఒలంపిక్ రన్ రైల్వే స్టేషన్ దగ్గర ప్రారంభమై బస్టాండ్ అమరవీరుల స్తూపం వద్దనుండి పోస్ట్ ఆఫీస్ సెంటర్ మీదుగా ప్రకాశం స్టేడియం వరకు కొనసాగింది. అనంతరం ఎమ్మెల్యే సాంబశివరావు మాట్లాడుతూ.. ఈ ఒలంపిక్ డే రన్ లో పాల్గొన్న ప్రతి ఒక్కరికి అభినందన తెలియజేస్తూ, క్రీడలు నిత్యం ఆడడం వల్ల ఆరోగ్యంగా ఉండడమే కాకుండా, శారీర దారుఢ్యంతో పాటు, మానసిక ఉల్లాసం ఏర్పడుతుందని అన్నారు. అలాగే క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో జాతీయ స్థాయిలో నిలిచి జిల్లాకు మంచి పేరు ప్రఖ్యాతలు తేవాలని కోరారు.ఈ ఒక్క రన్ లో ఉత్సాహంగా పలు క్రీడా సంఘాల కార్యదర్శులు, పీఈటీ, పీడీలు కోచ్ లు క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.



## సమస్యలు పరిష్కరించాలని వినతి

**కొత్తగూడెం,23 జూన్ (కెరటం న్యూస్):** కొత్తగూడెం నియోజకవర్గ ఇన్చార్జి మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు నాయకత్వంలో స్థానిక ఎస్సీ ఎస్టీ బీసీ నిరుపేద కుటుంబాలకు ఇళ్ల పట్టాలు, డబల్ బెడ్ రూములను శాంక్షన్ చేయాలని జిల్లా నాయకులు వై.ఆర్ నాయుడు, రాష్ట్ర కార్మిక నాయకుడు తెలంగాణ సురేష్, పట్టణ మహిళా అధ్యక్షురాలు బట్టు మంజుల ఆధ్వర్యంలో కలెక్టర్ కి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు ఆర్ వి రమణ, నన్నేబోయిన వీరభద్రం, రేగడి మధు, సరళ, ఉమా, స్వరూప ,జయ రాణి ,చంటి, మోత్కూరు రాము తదితరులు పాల్గొన్నారు.



